# అభిమానవతి పద్మ

(కథానిక)

(క్రిందటి సంచిక తరువాయి)

ప్రసాదు గుమ్మంలో అడుగుపెట్టగానే ఆ ఇంట్లో వాళ్ళందరూ తెల్లబోయి అతనివంక చూచారు. మామగారు ఎదురువచ్చి లోపలికి తీసికొని వెళ్లారు. పద్మ తానెందుకు వచ్చినదీ, మళ్ళీ యెందుకు వెళ్లనిదీ, వాళ్ళెంత అడిగినా చెప్పలేదు. అందువల్లే రెండు సంవత్సరాల తరువాత ఆనాడు గుమ్మంలోకి వచ్చిన అల్లుడితో యేమంటే యేమవుతుందోనని పద్మ విషయమే యెత్తకుండా ముభావంగా వూరుకున్నారు. "కులాసాగా వున్నారా?" అని అత్తగారు అడిగింది.

"ఆ, కులాసాగానే వున్నాను. ఆఫీసు పని మీద యీ వూరు వచ్చాను. అందరినీ ఒకసారి చూచి పోదామని వచ్చాను." ప్రసాదు కొంచెంగా తడబడ్డాడు. తనకూ, హేమకూ వివాహమయిన సంగతి వీళ్లకు తెలుసునో లేదో, అతనికి తెలియలేదు. వాళ్లెవరూ ఆ ప్రస్తావన తేవటం లేదు. తనేమీ ఆడంబరంగా పెళ్లాడలేదు. ఊరికే రిజిస్టరు చేసుకునివచ్చారు. ఆ ప్రక్క తనేం చేస్తున్నాడో వీళ్లకు తెలిసివుండక పోవచ్చును. అయినా యిలాంటి వార్తలు ఆగుతాయా? ఏమో!

నాలుగు మూలలా చూచాడు. కాని పద్మ కనపడలేదు. పద్మ ఏది అని అడిగేందుకతని మనసు తిరగబడ్డది. కాని అడగకపోతే, తీరా తనొచ్చినది తేలకుండానే పోవలసివస్తుందేమో! ఎంతోసేపు తనలో తాను యుద్ధం చేశాడు. కాని, ఎటూ తేల్చుకోలేక పోయినాడు. ఒక ఆలోచన తట్టింది చివరకు. వెడతానంటూ లేస్తే పద్మ వస్తుందేమో ననుకున్నాడు. వచ్చిన అర్ధగంటకే వెడతాననటం బాగుండదేమో! బాగేమిటి? ఈ అర్థగంటా అరవై యుగాలులాగా వుంది తనకు. ఆరాత్రికి వుండిపోతే పద్మ కనబడవచ్చేమో! కాని, వుండేందుకు తనకు శక్తి లేదనిపిస్తోంది. ఏమైనా సరే, వెడుతున్నానంటూ లేచేందుకు స్థిరపరుచుకున్నాడు. కాని, అప్పటికీ రాకపోతే? అప్పటి సంగతి చూచుకుందా మనిపించింది.

"ఇక వస్తాను. ఈబండికి వెళ్ళాలి" అంటూ లేచాడు.

"అదేమిటి? ఒక్క రోజన్నా వుండకుండా వెళ్ళిపోవటం ఏమిటి?" అంది అత్తగారు. ఆవిడ కంఠంలోని కంగారు స్పష్టంగా తెలుస్తూనే వుంది.

"అబ్బే వుండటానికి సెలవు లేదండి. మళ్ళీ రేపు డ్యూటీలో చేరాలి" అన్నాడు.

"మరి నీ యిష్టం. మేమేం చెప్పగలం?" మామగారు ఒక్క నిట్టూర్పు విడిచి నెమ్మదిగా అన్నాడు.

ప్రసాదు బయలుదేరాడు. కాని పద్మ రాలేదు. చాల నిరుత్సాహపడ్డాడు. ఏం చేయాలో తోచక అలాగే మెల్లిగా యింట్లో నుంచి ముందుహాలులోకివచ్చాడు. తలెత్తిచూచి అలాగే ఆగిపోయాడు. ఆ హాలులో ఉత్తరపు వేపు గదిగుమ్మంలో పద్మ తలవంచుకుని నిలుచుని వుంది. ఆమె పద్మేనా అని సందేహపడేటంతగా మారిపోయింది. చెక్కిళ్ళల్లో గుంటలు పడ్డాయి. కళ్లు లోతుకుపోయి వున్నాయి. ముఖమంతా పాలిపోయింది. 'రెండు సంవత్సరాల అనుభవం చాలును' అన్న హేమ మాటలు చెవులో గింగురుమన్నాయి. అతని గుండె కరిగిపోయింది. కోపమంతా మరిచిపోయాడు. నెమ్మదిగా ఆమెను సమీపించి,

"పద్మా" అన్నాడు.

పద్మ మాట్లాడలేదు. అలాగే తలవంచుకుని నిలబడ్డది.

"నేను వెడుతున్నాను పద్మా. వస్తావా?"

---

పి. శారదా నాథ్

---

"ఉండండి."

గబగబ లోపలికి వెళ్ళి ఒక పెట్టె పట్టుకుని పది నిమిషాలలో వచ్చి,

"పదండి" అంది.

ప్రసాదరావు తెల్లబోయాడు. హేమ మాటలలో యింత సత్యముందనుకోలేదతను. రైలులో కూచునేదాకా ఇద్దరూ మాట్లాడలేదు. రైలు కదిలిన తరువాత పద్మతో హేమ సంగతి చెప్పాడు. ఆమె ప్రోద్బలంవల్లనే తను వచ్చినట్లు కూడా చెప్పాడు. పద్మ యేమీ మాట్లాడకుండా విన్నది. అతను చెప్పటమయిన తరువాత, తనలో రేగే భావాలను ప్రసాదు గమనిస్తాడనేమో కిటికీ దగ్గరగా జరిగి నిశ్చలంగా బయటకు చూస్తూ కూర్చుంది.

గుమ్మంలోకే యెదురు వచ్చి పద్మ చేయి పట్టుకుని లోపలికి తీసుకుని వెళ్ళింది హేమ. ప్రసాదు మాట్లాడకుండా తనగదిలోకి వెళ్లాడు. ఎంతో ఆనందంతో కలకలలాడుతున్న హేమ ముఖం చూచి పద్మకు నోట మాట రాలేదు.

"లే అక్కా. నీళ్లు కాగే వున్నాయి. స్నానం చేసిరా."

పద్మ మాట్లాడకుండా పెట్టెదగ్గరకు వెళ్ళి తన చీర తీసుకుంది.

"అలా కాదు. ఏదీ. నీ పెట్టె తెరు. ఇవాళ నాకెంతో సంతోషంగా వుంది. ఈ ఒక్క రోజు నేను చెప్పినట్లు వినవమ్మా అక్కా."

నవ్వుతూ తనే పెట్టెలో గుడ్డలన్నీ వెదికి ఒక ఆకుపచ్చ జరీ ఉప్పాడ చీర, దానికి తగిన రవిక తీసి, పద్మకందించింది. పద్మ హేమ వంక చూచింది. హేమ నవ్వుతూ,

"వెళ్లక్కా. అది కట్టుకుంటే చూడాలని వుంది" అంది.

స్నానంచేసి వచ్చిన పద్మకు తానే స్వయంగా తలదువ్వి జడవేసింది. దొడ్లోని పూలతో తాను కట్టిన మల్లెపూల చెండును తెచ్చి ఆమెకు పెట్టింది. ఒక్కసారామెను నిలువునా చూచి "ఎంత చక్కటి దానవక్కా" అంది. ఆ ధ్వనిలోని ప్రేమను పద్మ గుర్తించకపోలేదు. హేమ ప్రవర్తన పద్మను మూగదాన్ని చేసింది. పద్మ యిలాంటి ప్రేమవాత్సల్యాలకు సిద్ధపడి రాలేదు. హేమ విషయం రైలులో ప్రసాదు వల్ల వినగానే, తాను గుమ్మంలో అడుగుపెట్టిన క్షణంనుండి, యింటిలోని పరిస్థితులను, తాను యెదుర్కోవలసిన సంఘటనలను ఇంకోవిధంగా చిత్రించుకుంది తనలో. అందువల్లే హేమ ప్రవర్తనను తట్టుకోలేక పోయింది.

రాత్రి ఎనిమిదిగంటలవరకు అక్కడక్కడ తిరిగాడు ప్రసాదు. ఎందుకో యింటికి వెళ్ళటమంటే బెరుకుగా వుంది. హాలులోగాని గదిలోగాని హేమ, పద్మ కనబడలేదు. నెమ్మదిగా బయటకువచ్చి చూచాడు. హేమ, పద్మ, దొడ్లో చాప మీద కూచుని నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. పద్మ వెనకకు తిరిగి వుండటంవల్ల ప్రసాదును చూడలేదు. హేమ అతని కళ్ళలోని బాధను, ఆందోళనను కనిపెట్టి మెల్లిగా నవ్వి, అతనిని వెళ్ళమని కళ్ళతోనే చెప్పింది. ప్రసాదు చేసేది లేక తన గదిలోకి వెళ్ళిపోయినాడు.

"చాలా పొద్దుపోయినట్లుంది. పడుకుందాం అక్కా" అంది హేమ. ఇద్దరూ తలుపువేసి లోపలకు వెళ్ళారు. హాలులో వున్న మంచం మీద ఒళ్లు విరుచుకుంటు పడుకుంది హేమ.

"వెళ్ళక్కా పోయిపడుకో, నాకు కూడ నిద్రవస్తోంది."

పద్మ చుట్టూ చూచి "నా పక్క ఎక్కడ" అనడిగింది. హేమ నవ్వుతూ గది వేపు వేలితో చూపింది. అప్పు డర్థమయింది పద్మకు. ప్రొద్దుటి నుండి అణచుకుంటున్న వుద్రేకం కట్టలు తెగింది. చప్పున పద్మ రెండు చేతులతో తన ముఖం కప్పుకుని యేడుస్తూ "ఒద్దు, ఒద్దు" అంది. హేమ పద్మను దగ్గరకు తీసుకుని ఆమె కళ్లు తుడుస్తూ,

"తప్పక్కా" అలా ఏడవరాదు. జరిగినవన్నీ మరిచిపోవాలిగాని యిలా బాధ పడకూడదు."

"నీకు తెలియదు హేమా. నన్నిక్కడే పడుకోనీ. నేను వెళ్ళలేను."

"ఛా. అవేం మాటలు? పిచ్చా నీకు? వారన్నీ మరిచిపోయినారు. నీవల్లా అనకూడదు. ఈ రాత్రిలో గతాన్ని పూర్తిగా సమాధి చేయండి. అదే నా కోరిక."

* * *

రెండునెలలు గడిచినాయి. ముగ్గురు ఎంతో

సంతోషంగా రెండు రోజులలాగ గడిపారు. ముఖ్యంగా హేమ, పద్మ తమ బాంధవ్యాన్ని మరిచి సంచరించేవారు. ఒక్కొక్కసారి ప్రసాదాశ్చర్యాన్నణచుకోలేకపోయే వాడు. హేమ అలా ప్రవర్తించ గలుగుతోందంటే అందులో వింతేమీలేదు. ఆ మెది మొదటినుండీ అటువంటి గొప్ప హృదయమే. కాని, పద్మ! ఒకప్పుడంత అహంకారంలో దేనినీ లక్ష్యంచేయని పద్మేనా యీ పద్మ!

రెండుసంవత్సరాలుగా మనోవ్యాధితో కృంగిపోయిన పద్మ ఆరోగ్యంకూడ కొస్త చెడింది. తరుచు తలనొప్పి, గుండె దడ వస్తూవుండేవి. అలా దడ వచ్చినప్పుడెంతో నీరసించిపోయేది. ఏపని చేసేందుకు మనస్కరించేది కాదామెకు. సాధ్యమైనంతవరకు తోసుకుని తిరిగేందుకే ప్రయత్నించేది. కాని, కొన్ని సమయాలలో తప్పని సరిగా తన బాధను తెలియచేయవలసి వచ్చేది. ఎవరైనా స్నేహితులు తమనాహ్వానించినప్పుడో, సినిమాకు వెళ్ళాలని ఏర్పాటు చేసుకున్నప్పుడో, ఖర్మవశాత్తు పద్మకొనాడే హఠాత్తుగా దడవచ్చేది. దాంతో, శక్తిలేక తనురాననీ వారిద్దరినీ వెళ్లమనీ అనేది. హేమ అర్థం చేసుకునేది కాని, ప్రసాదు మనసు మాత్రం చివుక్కుమనేది. పద్మ యింతగా నీరసించినట్లు తనకి తెలియదు. పూర్వపు పెంకెతనమింకా పోలేదనీ, అప్పటి మోస్తరు దురుసుగా మాట్లాడే అవకాశంలేక, యిలా అంటోందనీ అభిప్రాయ పడేవాడు. దాంతో మనసంతా కలచినట్లయేది. గతమంతా మరచి తననింత ప్రేమగా చూస్తున్నా యింకా తన స్వభావాన్ని పూర్తిగా మార్చుకోలేకపోయిందన్న విషయం ప్రసాదు నమితంగా బాధించేది. కాని పైకేమీ అనేవాడుకాదు. ఇతని హృదయంలో యీ విధమైన మేఘాలు క్రమ్ముకుంటున్నాయని హేమకూ తెలియదు. పద్మయినా తనభర్త తన నీరసస్థితిని పూర్వపు ప్రవర్తనలో జతపరచి బాధపడుతున్నాడన్న విషయమెరుగదు. అందువల్ల ఆ సందర్భాలలో ప్రసాదు బాధపడ్డా, పద్మ హేమ మాత్రం అమాయకంగా, సంతోషంగానే వుండేవారు.

హేమతో కలిసి చదువుకున్న మీనాక్షి, తాను పుట్టింటికి వచ్చినట్లూ, హేమని చూడాలని వున్నది కనుక ఒక్కసారి వచ్చిపొమ్మనీ, కబురు పంపింది. హేమ ప్రసాదుతో చెప్పి పొద్దున్నే మీనాక్షిగారింటికి వెళ్లింది. ప్రసాదు కూడ మామూలుగా భోజనంచేసి ఆఫీసుకు వెళ్ళాడు. అతను వెళ్లిన అర్థగంటకే పద్మకు దడ, తలనొప్పి ప్రారంభమయింది. నీరసంగా వెళ్లి గదిలో పడుకుంది. ఎంతసేపలా మగతగా పడివుందో! ప్రసాదు పిలుపు విని వులిక్కిపడి కళ్లు తెరిచింది. పద్మకోసం వెతుకుతూ ప్రసాదప్పుడే గదిలోకి వస్తున్నాడు.

"ఇంకా పడుకునే వున్నావా? త్వరగా లేచి బట్టలు వేసుకో. సుదర్శనం పుట్టిన దినమట. సినిమాకు వెడదాం రమ్మని పిలిచాడు. అతను భార్యను తీసుకుని హాలు దగ్గరకు వస్తానన్నాడు. హేమలేదనీ, నిన్ను తీసుకుని వస్తాననీ చెప్పి, గబగబా ఇంటికి వచ్చాను. త్వరగా కానీ. పాపం అతనెంతో సరదాపడి పిలిచాడు" అంటూ ప్రసాదు బూడ్సులు విప్పటం మొదలు పెట్టాడు. పద్మ మనసు చివుక్కుమన్నది. ఎటూ తోచలేదామెకు. తను చాల నీరసంగా వుంది. హేమన్నా లేదు. పాపమా సుదర్శనం భార్యతో హాలుదగ్గర కనిపెట్టుకుని వుంటాడు గాబోలు. ఏమిటి చెయ్యడం?

"ఇంకా పడుకునే వున్నావే పద్మా?"

"నాకు తలనొప్పిగావుంది. మధ్యాహ్నం నుంచి పడుకునేవున్నాను. వచ్చేందుకు ఓపిక లేదు.మీరు వెళ్ళిరండి" బెదురుతూనే చెప్పింది హేమ.

బూట్లు విప్పుకుంటున్న వాడల్లా ఒక్కసారిగా తలెత్తి చూశాడు. ఈసారి తనకి కోపం కూడ కలిగింది.

"నీ మతం నా కర్థం కాకుండా వుంది పద్మా!"

పద్మ తెల్లబోయింది.

"ఎప్పుడైనా ఒకసారయితే తల నొప్పనుకో వచ్చును. ఎప్పుడు సరదాపడి ఏర్పాటుచేసుకున్నా, నీకా తలనొప్పి కూడా అదే సమయానికి వచ్చేటట్లు వుంది" మళ్ళీ అన్నాడతను.

పద్మకు బాధ కలిగింది. మెల్లిగా"మీఇష్టం. మీరలా అనుకుంటే నేనేం చేయను?" అంది.

ప్రసాదుకు కోపమాగలేదు.

"అవును. అంతా నా యిష్టమే. మీతో రావటం నా కిష్టం లేదని ఒక్కసారి స్పష్టంగా చెప్పేయరాదూ? ఈ వెధవ నటనలన్నీ దేనికి? నే నీ విషయం చాల రోజులనుండీ గమనిస్తు న్నాను. నిజం పద్మా. నీలోని పెంకెతనం, అహంకారం, యింకా పోలేదన్న మాట!" భర్త తన నా విధంగా అపార్థం చేసుకుంటు న్నాడని తెలిసేసరికి పద్మకు ఆశ్చర్యంతో పాటు దుఃఖం కూడ కలిగింది. నోటివెంట మాట రాలేదు. అతి ప్రయత్నంమీద కళ్ళ నీళ్ళాపు కుంటూ, అలాగే నిశ్శబ్దంగా పడుకుంది.

"ఇంతకూ నీవు రాదలుచుకోలేదన్న మాట! స్నేహితుల ముందు నా గౌరవం నిలపాలన్న భావమన్నా లేదే నీకు! నాతో బైటికి రావ టమే నీకంత సిగ్గుగాను, అభిమానంగానువుంటే మళ్ళీ మరి నాతో ఎందుకు వచ్చావు? సుఖంగా మీ వాళ్ళింట్లోనే వుండకపోయావా?" పద్మ యీ మాటల కదిరిపడింది. భర్త నోటివెంట యిలాంటి మాటలు వస్తాయని ఆమె కలలో కూడా అనుకోలేదు. అతని మాటలామె అభి మానాన్ని నిజంగానే పైకిలాగాయి.

"మీకంత కష్టంగావుంటే పోనీ వెడతా లెండి" అంది నెమ్మదిగా.

ప్రసాదుకి మండిపోయింది. "వెడితే వెళ్లు. నన్నేం బెదిరిస్తావా? వెధవ అహంకారం. మొదటినుంచీ నీ గుణ మిదేగా? నాకు క్రొత్తా? ఆసారి హేమ బలవంతంమీద వచ్చాను. నీవు పోయినప్పుడల్లా వచ్చి బ్రతిమాలుతా నను కున్నావు గాబోలు!

"ఛీ. వెధవ గోల..."

గబగబ బైటికి వెళ్ళిపోయినాడు. పద్మకు అణుచుకుంటున్న దుఃఖం ఒక్కసారిగా పై కుబికింది. ప్రపంచమంతా యింతేనేమో! ఒక సారి చేసిన తప్పును సరిదిద్దుకునే అవకాశం, సంఘం స్త్రీ కివ్వదు కాబోలు. ఎటువంటి మాటలు వినాలిసి వచ్చింది! నిజమే, తనెందుకు వచ్చినట్లు? ఏదో అంతా మరిచి, జీవిద్దామనే ఆశపడ్డదే గాని, తను మరచినా, యితరులు మరవటం దుస్సాధ్యమని తెలియలేదు. తెలిసి నట్లయితే, వచ్చి యిలాంటి అవమానం పొందేకన్నా, రాకుండా వుండటమే బాగుం డేది! పట్టలేక ముఖం కప్పుకుని వెక్కి వెక్కి ఏడిచింది.

"అక్కా"

పద్మ వులిక్కి పడింది. హేమ పక్కలో కూచునివుంది. ఆమెను చూడగానే మళ్లీ ముఖం చేతులలో కప్పుకుంది పద్మ.

"ఊరుకో అక్కా. నేనంతా విన్నాను. గుమ్మంలో అడుగు పెట్టేసరికి వారి అరుపులు వినబడ్డాయి. పక్క గదిలో కూచున్నాను. వారి మాటలు విన్న తరువాత, వారిముందుకు వచ్చేందుకు నాకు కూడ మనస్కరించలేదు. అందుకే వారు బైటికి వెళ్లేదాక అక్కడే కూచున్నాను... ఊఁ, ఇక వూరుకోవాలి"

"ఊరుకుంటాను. ఊరుకోక చేసేదేముంది? వారి మనసులో ఇలాటి భావాలుంటే అవకాశ మున్నదని తట్టనుకూడలేదు. నిజం హేమా. ఇక నేనున్నా వొకటే, లేకపోయినా ఒకటే. అన్ని మాటలన్నతరువాత యిక వారి ముఖం చూడలేను, వెళ్ళిపోవాలి. అవును. వారు రాక ముందే వెళ్లిపోతాను."

"ఏమిటిది? పిచ్చానీకు? ఎక్కడికి వెడ తావు? వెడితే కష్టనష్టాలెవరికనుకుంటున్నావు? ఏదో కోపంలో అన్నారని నీ సంసారాన్ని నీవే వదులుకుంటావా? లేలే. పద. కాఫీ చేసి స్తాను. ఈ ఉద్రేకం తగ్గితే అన్నీ వాటంతటవే సర్దుకుంటాయి."

పద్మ మాట్లాడలేదు.

రాత్రి తొమ్మిది గంటలకు ఇంటికి వచ్చిన ప్రసాదుకు పద్మ హేమ కబుర్లు చెప్పుకుంటూ వంటఇంటిలోకనబడ్డారు.ఇంటిదగ్గిరి వాతావరణ మింత ప్రశాంతంగా వుంటుందనుకోలేదతను. నిశ్శబ్దంగా గదిలోకి వెళ్ళాడు. ఆ రాత్రి అత నెవరితోనూ మాట్లాడలేదు. హేమ వచ్చి భోజ నానికి పిలిచింది. "సుదర్శనం గారింట్లో చేసి వచ్చాను"అన్నాడు.

ఆమెకూడ యేమీ అనలేదు.

* * *

"అక్కా"అన్న హేమ ఆక్రందన ధ్వని విని ప్రసాదు అదిరిపడిలేచాడు నిద్ర మంచం మీదినుంచి. ఖంగారుగా ముందు హాలులోకి

వెళ్ళాడు. హేమ కుర్చీలో కూచుని, చేతులలో ముఖ కప్పుకుని ఏడుస్తోంది. ప్రసాదుకేమీ అర్థం కాలేదు. గబగబ ఆమె దగ్గరకు వెళ్ళి "ఏమిటి హేమా? ఏమయింది? ఎందుకలా ఏడుస్తావు?" అన్నాడు ఖంగారుగా. హేమ మాట్లాడలేదు. మడిచిన ఒక కాగితాన్నతనికందించింది. ఏమిటోఅర్థంగాక దాన్ని తొందర తొందరగా విప్పాడు,

"చెల్లీ, నిజంగా నీవు నా చెల్లివే. మొదటగా వారు నీ పేరు చెప్పినప్పుడు బాధతోనూ, భయంతోనూ మనసు రెపరెపలాడింది. ఈ చెల్లెలి మూల్యమానాడు తెలియలేదు. చెల్లీ, సెలవు. నీ వన్నావు,

"ఎక్కడికి వెడతావక్కా. నీకే నష్టం గాని, మరెవరికి?" అని. నిజమే హేమా, నష్టం నాకే. అందుకే తెగించ గలిగాను. ఇందులో యింకొకరి ప్రమేయముంటే నాకీ సాహసం కలిగేదే కాదేమో!

వారన్నట్లు నాకహంకారం చాలా ఎక్కువగానే వుంది. ఒప్పుకుంటాను. ఆ అహంకారమే నా నాశనానికి కారణమైనది. ఏదెలా వున్నా, వారన్నీ మరిచి ప్రవర్తిస్తున్నారనుకున్నానే గాని, వారిలో అలాంటి సందేహాలు, యింకా వదలని అనుమానాలు, కుశంకలు, వున్నాయనుకోలేదు. ఇదంతా నా దురదృష్టం. వారు రమ్మన్నారు. నా అహాన్ని త్యజించి సుఖపడదామని, అమాయకంగానే వచ్చాను. కాని, సందేహాలకు అవకాశమిచ్చిన నాకిక యీ జీవితంలో సుఖపడే యోగం లేదని, యీరోజే అర్థమయింది. ఇక నేనుండట మనవసరం. అజ్ఞానంలో జారిన కాలును జీవితాంతం బైటికి తీయటం స్త్రీకి సాధ్యం కాదని తెలిసింది. ఈ పరిస్థితులలో వుండటానికి నాకు సాధ్యంగా కనబడటం లేదు. నేనిలా అనుకోటం దురభిమానమేమో. కాని ఏంచేయను? నా జన్మ అలా సృష్టింపబడ్డది.

"ఎక్కడికి వెడతావక్కా" అన్నావు. అజ్ఞానంలో కళ్లు మూసుకునిపోయిన ఆ రోజులలో నంటే అమ్మగారింటికి వెళ్ళాను. కానీ, యిప్పుడెక్కడికివెడతానో తెలియదా హేమా? నేను వెళ్ళగల వెళ్ళతగిన, స్థలమదొక్కటే. వారిని క్షమించమని అడిగే ధైర్యం నాకులేదు..

చెల్లీ సెలవు. అక్కని మరిచిపో. వారికి నా నమస్కారమందజేయి.

పద్మ."

గజగజ వణికిపోయినాడు ప్రసాదు. అతనినే పరీక్షగా చూస్తున్న హేమ కతనివాలకం చూచేసరికి కోపమాగలేదు.

"ఏం? అలా కంగారు పడతావెందుకు? 'పోతేపో' అంటిరిగా! పోయింది నిర్భాగ్యురాలు. ఇక సుఖంగా వుండండి."

"హేమా" జాలిగా అన్నాడు.

"హేమా! వెధవ ప్రపంచ మింతేకదూ! అహంకారాలు, అధికారాలు, అనుమానాలు, దీంతో సరిపోతుంది. ఒకళ్ళ నేడిపిస్తారు, వాళ్ళేడుస్తారు. ఉన్నన్ని రోజులు సుఖపెట్టి సుఖపడటం చేతకాకపోయినా, చచ్చిన మరుక్షణంనుండి ప్రేమ పుట్టుకొస్తుంది. దుఃఖపడటం నెత్తి బాదుకోటం ఇంకా కావాలనంటే వాళ్ళ ఫోటో నొకదానిని పెట్టుకుని పూలమాలలతో పూజించటం, ఇవన్నీ వుండనే వున్నాయిగా? ఇంకా బిత్తరపోయి చూస్తారెందుకు? ఇద్దరూ తప్పుచేశారు. కాని, నిజానికి మీదె యెక్కువ. ఆవిడ బాధలోను, గర్వంలోనూ మిమ్మల్ని వదిలి వెళ్ళగలిగింది. అంతమాత్రమే. మీరు ఆవిడను కాదని మరొకరిని తెచ్చుకోగలిగారు. ఇంతైనా ఆవిడ మిమ్మల్ని క్షమించగలిగింది. ఆవిడే అలా యింకొకాయనను పెళ్ళాడి మీ రావిడను 'రమ్మన్న'ట్లే మిమ్మల్నావిడ పిలిస్తే సహించి, క్షమించి వెళ్ళగలిగేవారా? కాని, ఆవిడ రాగలిగింది. ఐతే నేమి? మీ గొప్పతప్పును ఆవిడ క్షమించగలిగింది కాని, ఆవిడ చిన్నతప్పును మీరు మరువలేక పోయారు. ఇక లాభంలేదని గ్రహించుకుని ఆవిడ వెళ్ళిపోయింది"......దుఃఖంలో కంఠం బొంగురుపోయింది హేమకు.

ప్రసాదు మాట్లాడలేదు. అలాగే తల వంచుకుని నిలుచున్నాడు.

"అవును. నిజమే"నన్న దతని మనసు. రెండు కన్నీటిచుక్కలు రాలి నేలమీద పడ్డాయి.

(సమాప్తము)